క్లుప్తంగా

ఆలయానికి వంటపాత్రలు అందజేత



చిట్టేల(వత్సవాయి): చిట్టేల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి మక్కపేట గ్రామానికి చెందిన దారాబోయిన వీరబాబు దంపతులు రూ. 50 వేల విలువ చేసే వంటపాత్రలను మంగళవారం అర్చకులు శివరాంప్రసాద్ శాస్త్రి, సిరికొండ సాయికృష్ణామాచార్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను శాలువా, పూలమాలతో సత్కరించారు. కాగా ఆలయంలో ప్రతి శనివారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం అందజేత



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గ్రామానికి చెందిన కనపర్తి వెంకటరమణ కుటుంబ సభ్యులు రూ. 51 వేలు విరాళాన్ని మంగళవారం ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమాకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలను శాలువా, పూలమాలతో సత్కరించి అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు.

పశువుల తాగునీటి తొట్టెలకు శంకుస్థాపన



పెనుగంచిప్రోలు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు. పశువులకు తాగునీటికి తొట్టెలు, గోశాలు, గోకులాలు ఏర్పాటు చేయడానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీ శ్రీను, పశువైద్యాధికారి పీ అనిల్, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గజ్జి కృష్ణమూర్తి, చుంచు రమేష్, కర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల తాగునీటికి కొరత లేకుండా చర్యలు

అన్నవరం(జగ్గయ్యపేట): వేసవిలో పశువులకు తాగునీటికి కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేయనున్న నీటితొట్టి నిర్మాణ పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నీటితొట్టెలు ఏర్పాటు చేస్తుందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి జీవాలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, ఏపీవో రామకృష్ణ, సర్పంచ్ మీగడ వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



నందిగామ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు విధిగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ఐతవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ముఖ్యంగా ఎత్తు, బరువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం కేంద్రంలోని చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీడీపీవో కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 22వ వార్డు మిట్టగూడెంలో సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు స్థానిక నేతలతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ సొమ్ము ఒకేసారి పెంచి అందిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో షాదీఖానా

- దశాబ్దాలు దాటుతున్నా మరమ్మతులు కరువు
- పెచ్చులూడి పడుతున్న శ్లాబ్
- శుభకార్యాలకు ఇబ్బందులు పడుతున్న ముస్లింలు



శిథిలావస్థకు చేరిన జుజ్జూరు గ్రామంలోని ఉర్దూఘర్ కం షాదీఖానా

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలోని షాదీఖానా పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా దర్శనమిస్తోంది. పేద ముస్లిం వర్గాలకు చెందిన ప్రజలు వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునేందుకు 2003వ సంవత్సరంలో గ్రామంలో ఉర్దూ ఘర్‌కం షాదీఖానా నిర్మించారు. షాదీఖానా నిర్మించిన మొదట్లో బాగానే ఉన్నప్పటికీ రానురానూ కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో నేడో రేపో అన్నట్లు కూలేందుకు సిద్ధంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

అవస్థలు పడుతున్న పేద ముస్లింలు

జుజ్జూరు గ్రామంలో 10 వేలకు పైగా ముస్లిం జనాభా ఉన్నారు. వారిలో పేద వర్గాలకు చెందిన వారే సింహభాగం ఉన్నారు. వీరంతా ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అద్దెలు చెల్లించే స్థోమత లేక వివాహాలు తదితర శుభకార్యాలను షాదీఖానాలోనే నిర్వహించుకుంటుంటారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో అప్పొసొప్పో చేసి అద్దెలు చెల్లించి వేడుకలు చేసుకుందామన్నా గ్రామంలో ఫంక్షన్ హాల్స్ లేవని వాపోతున్నారు. ఫంక్షన్ హాల్ కావాలంటే 10 కి.మీల దూరంలో ఉన్న కంచికచర్ల వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

షాదీఖానా పూర్తిగా శిథిలావస్థకు చేరిందని కనీస మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయిందని ముస్లింలు చెబుతున్నారు. షాదీఖానా బారిన పడి జరగరాని ప్రమాదం ఏదైనా జరిగితే పరిస్థితేంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి షాదీఖానాకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

చువ్వలతో దర్శనమిస్తున్న పిల్లర్లు


పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు వచ్చి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

షాదీఖానా శ్లాబ్ పెచ్చులూడి పడుతుండగా.. పిల్లర్లు ఇనుప చువ్వలు బయటకు వచ్చి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. 22 ఏళ్ల క్రితం నిర్మించిన షాదీఖానా కావడం.. నాటి నుంచి కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరింది. షాదీఖానాలో శుభకార్యాలు చేసుకునే సమయంలో పెచ్చులూడి మీద పడటంతో పలువురికి గాయాలైన ఘటనలు సైతం ఉన్నాయని పేద ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేడుక సంగతెలా ఉన్నా షాదీఖానా పరిస్థితి చూస్తే ప్రాణాలు అరచేత పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

శుభకార్యాలకు ఇబ్బంది



గ్రామంలోని షాదీఖానా పూర్తి శిథిలావస్థకు చేరింది. షాదీఖానాలో వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు ఇబ్బందిగా ఉంటుంది. పేద వర్గాలకు చెందిన వారు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే మరమ్మతులకు చర్యలు చేపట్టాలి.

– రాహిల్ రాజా, మత గురువు

మరమ్మతులు చేపట్టాలి



షాదీఖానా 2003లో నిర్మించారు. అప్పటి నుంచి కనీస మరమ్మతులు లేకపోవడంతో శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో వేడుకల సమయంలో భయాందోళన చెందాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి షాదీఖానాకు మరమ్మతులు చేయించాలి.

– షేక్ మీరా హుసేన్, జుజ్జూరు గ్రామం

నేడు రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

చందర్లపాడు(నందిగామ టౌన్): మండల పరిషత్ కార్యాలయంలో ఆయా కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధ, గురువారాల్లో సంబంధిత అధికారులు, బ్యాంకర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాంచారయ్య తెలిపారు. చందర్లపాడు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చందర్లపాడు, బొబ్బెళ్లపాడు, బ్రహ్మబొట్లవారిపాలెం గ్రామాల దరఖాస్తుదారులకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కాండ్రపాడు, కాసరబాద, కొడవటికల్లు, పొక్కునూరు, ఉస్తేపల్లి, వెలదికొత్తపాలెం గ్రామాల వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా గురువారం ఉదయం తొమ్మిది నుంచి ముప్పాళ్ల, మునగాలపల్లి, తోటరావులపాడు, గుడిమెట్ల, ఏటూరు, చింతలపాడు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి కోనాయపాలెం, తుర్లపాడు, విభరింతలపాడు, పున్నవల్లి గ్రామాల దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత కాపీలతో హాజరు కావాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పెనుగంచిప్రోలు: మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్న తొమ్మిది మంది బాధితులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం అందజేశారు. తొమ్మిది మందికి కలిపి మొత్తం రూ.18.33 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చింతల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి చర్యలు

నందిగామ రూరల్: పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని ఐతవరం, చందర్లపాడు మండలం పాటెంపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్లను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాటెంపాడులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. నాయకులు కోట వీరబాబు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే నందిగామ పట్టణంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు చలివేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు


నరేష్‌ను అభినందిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, గుత్తా శంకర్

జగ్గయ్యపేట అర్బన్: గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల సహకారంతో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం తన్నీరు నివాసంలో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావుతో కలిసి ఇటీవల వైఎస్సార్ సీపీ వత్సవాయి గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికైన మెట్టుకోలు నరేష్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. వత్సవాయి ఎంపీటీసీ సభ్యురాలు మెట్టుకోలు అనురాధ, వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి రూప్లానాయక్, నాయకులు బత్తుల జానకిరాములు, కుక్కల శ్రీధర్, వడ్లమూడి రాజేష్, షేక్ బాజీ, ఏసుపోగు శ్రీరాములు, జంగం రాజు, వెంకి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఏఐవైఎఫ్ జాతీయ 17వ మహాసభలు


ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఈశ్వరయ్య, లెనిన్ బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జాతీయ 17వ మహాసభలు మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, కార్యదర్శి నక్కి లెనిన్ బాబు తెలిపారు. విజయవాడ హనుమాన్‌పేటలోని సీపీఐ భవన్‌లో మంగళవారం జాతీయ మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి వెయ్యి మందికి పైగా యువజన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలు, రాజకీయాలు, నియంతృత్వ కార్పొరేట్ విధానాలు, విద్యా, వైద్య, ఉపాధి హక్కులు వంటి అంశాలపై సమావేశాల్లో చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. మహాసభల తొలిరోజు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గండాల సంతోష్ కుమార్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వై. బాబి, జి. నాగ రాముడు, కొంగర శ్రీనివాసులు, వై రాంబాబు, పి. ప్రభాకర్, నగర కార్యదర్శి లంకా గోవిందరాజు పాల్గొన్నారు.

ఘనంగా భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహా స్వామి వారి 75వ జన్మదినోత్సవ వేడుకలు మంగళవారం సత్యనారాయణపురంలోని గాయత్రీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సంపూర్ణ కృష్ణ యజుర్వేద పారాయణంతో కూడిన వేద సప్తాహము, వేదశాస్త్ర పండిత సన్మాన సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గురువు ఆది శంకరాచార్యులు స్థాపించిన శృంగేరి పీఠం భారతీయ సనాతన ధర్మానికి ప్రతీక అని తెలిపారు. గురుపరంపరలో సాగే ఈ పీఠం అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోందన్నారు. అనంతరం పలువురు వేద పండితులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జీ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు జి.కె. సుబ్బారావు, చల్లా సుధాకర్, వేద పండితులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికుల ప్రదర్శన


నిరసన ప్రదర్శన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు

తిరువూరు: గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఏపీ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ తిరువూరులో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. పారుగు సేవలను ఆప్కాస్ నుంచి ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టాలని ప్రభుత్వం యోచించడం తగదని, కార్మికులకు ఉద్యోగ భద్రత కరువై శ్రమ దోపిడీ జరుగుతుందని సీఐటీయూ నాయకులు బి. వెంకటేశ్వరరావు, ఎస్‌వీ భద్రం ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్కాస్‌లో ఉన్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రైవేటు ఏజెన్సీలలో పనిచేసిన పారుగు సేవల కార్మికులకు సకాలంలో జీతాలు రాక, పనివేళలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. యూనియన్ నాయకులు రమణ, సామ్రాజ్యం, గురవయ్య, నరసారావు దుర్గారావు, వెంకటరమణ, విజయమ్మ, వెంకటకృష్ణ, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన అవసరం

నందిగామ టౌన్: మొక్కలు పెంపకం, ఇంకుడు గుంతలు, ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని పర్యావరణ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీధర్‌ను ఆయన నివాసంలో మంగళవారం జేడీ లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వం కూడా నర్సరీలు, వివిధ సంస్థల ద్వారా మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. ఇంకుడు గుంతలు తవ్వుకోవడం వల్ల భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపా రవీంద్రనాథ్, వాసిరెడ్డి వంశీ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

వీరులపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుంధతీ దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి


విశ్వబ్రాహ్మణుల ధర్నాకు మద్దతు తెలుపుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

నందిగామ టౌన్: విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, మునగంటి కామేశ్వరరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణ సమీపంలోని చందాపురం బైపాస్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్, చేతి వృత్తిపై ఆధారపడిన వారికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. అన్ని హిందూ ఆలయాల పాలకవర్గంలో ఒకరిని సభ్యుడిగా చేర్చడంతో పాటు విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాయితీపై రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కాగా అటుగా వస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ విశ్వబ్రాహ్మణుల సంఘం ధర్నాకు మద్దతు తెలిపారు.

15లోగా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

నందిగామ రూరల్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ (పాలిసెట్–2025)ను విడుదల చేసిందని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 100లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 30న జిల్లాలోని నందిగామ, విజయవాడ, తిరువూరు పరీక్ష కేంద్రాల్లో జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎంచుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు కళాశాలలోని హెల్ప్‌డెస్క్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

66.31 శాతం ఆస్తి పన్ను వసూలు


మాట్లాడుతున్న కమిషనర్ రమణబాబు

నందిగామ టౌన్: పురపాలక సంఘం పరిధిలో 2024–25కు సంబంధించి ఆస్తి పన్ను మొత్తంగా 66.31 శాతం మేర వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆస్తి, ఖాళీ స్థలం పన్ను డిమాండ్ రూ. 5.61 కోట్లు ఉండగా రూ. 3.72 కోట్ల మేర వసూలు అయ్యాయని తెలిపారు. ఇంకా రూ. 1.89 కోట్లు బకాయి ఉందన్నారు. ఆస్తి, ఖాళీ స్థలం పన్ను వసూళ్లు గతేడాది కంటే 17.20 శాతం అధికంగా వసూలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే నీటి పన్ను డిమాండ్ రూ. 2.24 కోట్లు ఉండగా రూ. 40.64 లక్షలు వసూలు అయ్యాయని చెప్పారు. నీటి పన్ను రూ. 1.80 కోట్లు బకాయి ఉందని చెప్పారు. గతేడాది కురిసిన వర్షాలు, వరదల కారణంగా మంచి నీటి పైప్‌లైన్‌లు పాడై నీటి సరఫరాకు అంతరాయం కలిగిందని దీంతో ఆ పన్ను వసూళ్లలో ప్రజలపై వత్తిడి చేయలేదని తెలిపారు. పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సీసీ కెమెరాలు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు

వీరులపాడు: ప్రైవేట్ స్థలంలో ఉన్న సీసీ కెమెరాలు, ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ అనిల్ కథనం మేరకు.. మండలంలోని వెల్లంకి గ్రామంలో 'గ్రామ పునఃనిర్మాణ సంస్థ' 1982లో సర్వే నెంబరు 151లో 8.53 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. అయితే గ్రామానికి చెందిన కొంత మంది ఆ స్థలాన్ని ఆక్రమించుకుని తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ సంస్థ ప్రతినిధులు కోర్టుకు వెళ్లగా 2015లో ఆ భూమి సంస్థకు చెందిందని తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ కాలనీవాసులు ఆ భూమిని ఖాళీ చేయకపోవడంతో ఆ సంస్థ ప్రతినిధులు కోర్టు ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ భూమిలో అక్రమంగా ఉంటున్న వారిని ఖాళీ చేయించారు. ఇటీవల సంస్థ ప్రతినిధులు ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే సోమవారం రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆ స్థలంలో ఉన్న సీసీ కెమెరాలు, ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ ప్రతినిధి కోటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పద్మశాలీయ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


పద్మశాలీయ సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మైలవరం: భద్రావతి సమేత భావనా ఋషి స్వామి వారి దేవస్థానంలో పద్మశాలీయ సేవా సంఘం –2025 నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ద్వారకా తిరుమల దేవస్థానం, ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్‌గా శ్రీ రాజా వెంకట సుధాకరరావు పర్యవేక్షణలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పద్మశాలీయ సేవా సంఘం మండల అధ్యక్షులుగా దునకా ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా తాటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మా సురేష్‌బాబు, కోశాధికారిగా మసనం సుధాకరరావు, ఉప కార్యదర్శిగా బూదాటి జగదీష్, సహాయ కార్యదర్శులుగా ఉడతా వెంకట కృష్ణారావు, గణపవరపు పెరుమాళ్లు, అవ్వారు శ్రీనివాసరావు, పెండెం వెంకట్ దుర్గారావు, గౌరవ అధ్యక్షులుగా గణపవరపు విష్ణువర్ధనరావు, తాటి తులసీరావు, దునకా రాధాకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా పులిపాటి శ్రీనివాసరావు, ఉగిరి పరుశురామ్, చిట్యాల శ్రీనివాసరావు, పెండెం శ్రీనివాసరావు, మేలిమి శివాంజనేయులు ఎన్నికయ్యారు.

పోక్సో కేసుల దర్యాప్తులో అప్రమత్తంగా ఉండాలి

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణవేణి

విజయవాడస్పోర్ట్స్: పోక్సో కేసుల దర్యాప్తులో పొరపాట్లు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణవేణి పోలీసులకు సూచించారు. పోక్సో కేసుల దర్యాప్తుపై జిల్లాలోని పోలీసు అధికారులకు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీపీ కృష్ణవేణి మాట్లాడుతూ నేర స్థలంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాక్ష్యాలు, ఆధారాలు సేకరించాలని సూచించారు. దర్యాప్తు అనంతరం చార్జ్‌షీట్‌ను సవివరంగా రూపొందించాలని చెప్పారు. ఈ విషయంలో విచారణ అధికారులు నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలి కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, డీసీపీలు ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు. అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణవేణికి పోలీసు అధికారులు జ్ఞాపిక అందజేశారు.

బైక్ దొంగ అరెస్ట్

మైలవరం: మైలవరం మండలంలో ద్విచక్ర వాహన దొంగను అరెస్టు చేశామని ఎస్‌ఐ సుధాకర్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ సుధాకర్ మాట్లాడుతూ మైలవరంలో గత కొంతకాలంగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులు అందుతుండటంతో నిఘా పెట్టామని చెప్పారు. మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద దొంగిలించబడిన నాలుగు ద్విచక్రవాహనాలు గుర్తించామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు.